# ఏలేలో

తానెక్కిన రైలుబండి కులుకుతూ, కుదుపుతూ తాళ మానగతుల తరలిపోయి, తలశిల గ్రామం శివారున, మరో ఊరు ఆసామీ చేసువారను ఉమ్మడిగా ఆగంగా –

అక్కడ ఆ పూటకు దిగింది తానొక్కడే.

బండిని అక్కడనుంచి తరలించే సన్నాహంలో ఉరుకులూ పరుగులూ మీద, ఉన్న ఆసామిని వెంట తరిమి, స్వగ్రామంలో కొనుక్కున్న టిక్కెట్టు వారికి యథాతథంగా వప్పగింతపెట్టి ఇహ రోడ్డుపుచ్చుకుందా మనుకుంటాండంగా, పచ్చా ఎర్రా బావుటాలవారు...

శాస్త్రుర్లుగారు మందే గ్రామం? అనగా, ఫలానా అని చెప్పి –

"ఊళ్లోకేనా, ఇంకా పైకా" అనగా, అందీ పొందనట్టు ఊఁ అనేసి –

బంధువు లింటికా అనంగా, ఔనో కాదో తేలకుండా అహఁ అని, మొత్తంమీద అక్కడనుంచి తప్పించుకుని బయటపడి రహదారందుకున్నాడు.

అదిగో, ఊరు పట్టు పది బారలు, చేరుకుంటాడు–వారి ఇల్లు ఎక్కడ అని ఎవరిని...ఎవ్వరిని నోరు తెరచి అడగటం?

ఎలా వాకబు చేయడం?

వాళ్ళ నడుమ ఉండదుకదా! విసిరేసినట్లు ఓ పెడగా ఉండాలి. బహుశా, ఆ చెరువు గట్టున ఒంటితట్టుగా ఉన్నదే కావచ్చును. బందోబస్తుగానే ఉంది లోగిలి. ఆడుతూ పాడుతూ, అంతో ఇంతో వెనకేసి ఉండాలి. గడప ఆట్టే అరిగినట్టు లేదు. ఈ మధ్యలో ఎన్నడో మరమ్మతుచేయించి ఉండాలి.

పద్మకోశహస్తంతో, తలుపు గుసగుస తట్టంగా తీశాడు ఓ తానీషా. బొమలు ఎగుర వేశాడు.

చూడు సాయేబూ, మరే, ఈ గ్రామంలో కందికట్టువారి లోగిలి ఎక్కడా అని ఎవరినన్నా అడిగి తెలుసుకుందామని, ఊరికి కొత్తవాణ్ణి చూడు, ఎదురుగుండా మీ గుమ్మం కనబడితే –

కందికట్టువారంటే – కలాలీలా?

కాదు. వెనుకటికి దేశం పచ్చగాఉన్న రోజుల్లో దేవుడి ఉత్సవాలకీ, ఇంకా పరువున్న మోతుబరులైతే, వారి ఇళ్ళల్లో శుభ కార్యాలకూ మేజువాణీ చేస్తూండేవారట. రాకేందువదన అంటారట. పాతికపైనా, అరవైకి లోపూ, ఒకటో అరో అటో ఇటో....సుమారు ఆ వయస్సులో వారట. కుదిమట్టంగా, దబ్బపండు పళాన ఉంటారట. తలకట్టులో బాలమెరుపు ఇప్పుడిప్పుడే అంకురించిందట. మాట

కొంచెం తొందర కాని, మనిషి వస్తుతః నిదానస్థురాలట. ఇదే గ్రామంట! ఖరారుగా తబిసీళ్లు తెలుసుకునే వచ్చాను.

రత్తమ్మా! ఏదో పేరు చెపుతారేం!

నేనన్న మనిషి రత్తమ్మా, ముత్తమ్మా కాదయ్యా.

ఇదుగో చూడు. పూర్తి విలాసం వ్రాసుకొచ్చాను! ఏమనుంది? నిన్ను చూడగా, నిన్న మొన్న పుట్టినట్టు లేవు. నీకు తెలియకపోవడ మేమిటి చెప్మా. పోనీ ఇలాచూడు, చిక్కడపల్లి చిన్న దివాన్‌గారున్నారే, ఎవరు? భుజంగరావు పంతులుగారు – ఆ ఇంటి తాంబూలం ఖర్చు – ఒకానొకప్పుడు తమమీద వేసుకున్నారట.

ఇప్పటికన్నా గురుతు కొచ్చిందా?

వచ్చింది. అల్లదిగో! ఆ జువ్విచెట్టు – దాని వెంబడే సాలెవీధి – కొసాకు మదురు తగులుంది. అడగా పెట్టా అవసరంలేదు, తలుపు నెట్టుకు లోన కెళితే బాదంచెట్టు – దాని కింద మద్దెల కొట్టుకుంటూ ఉంటాడు అంకాలు – వాడిని అడగండి. హంగుచేసేది వాడు...అన్నాడు ఆ పాచ్చా,

సరే. అటు పోకమానవల్లనా! మరో దారి లేకపోయెను –

అహాఁ తురక మాట. ఇంతమట్టుకు నిజం. బాదంచెట్టుంది. మద్దెల మ్రోగుతుంది. దగ్గిరసా వెళ్లి చూడబ్బాయ్ అన్నాడు. వాడు తనవంక – వంటివేల మద్దెల పుణుకుతూనే ఎగాదిగా చూశాడు.

మరేఁ జూశావ్ అని చేజాపాడు.

నశ్యమా – లేదు.

“నశ్యం కాదు. రాజనశ్యం – మహారాజనశ్యం, ఆ రాకేందువదనను ఒక్క విడత కలుసుకోవాలి. మూడు ముక్కలు ఆ చెవి వేయాలి. ఇప్పుడే బండిదిగి వస్తున్నా. దిగడ మేమిటి – యకాయకి వచ్చేశాననుకో. వేగిరం పని ముగించుకుని తూరుబ్బండి అందుకుంటే రాత్రికన్నా భోజనప్రాప్తి ఉంటుంది. లేదా...”

“రత్తామ్” అని కేకవేశాడు అంకాలు “యామ్” అని జామిచెట్టు మొగదలనుంచి వినవచ్చింది. “వీరు ఏమిటో అంటున్నారు కనుక్కో.” మనిషి కదిలివచ్చింది. మాంచి మిన్నతీమీదుంది. ముసలితనం అట్టే ఏకోశానా కనిపించకపోయినా – ఓ పిసరు వదవదనాడుతూ ఇమాంపసందల్లే ఉంది. శూద్రకళ ఏ వంకనా లేదు. పైగా – తగుపాటి శుచిగా ఉన్నట్టూ అగుపిస్తూంది.

అసి దీనిల్లి ఇబ్బడి బంగారంగానూ – ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తూంటే ఆ హావణి ఎలా ఉపమిస్తూందంటేను – అదనుకు మదన మహీపతులవారిని ఆ రతీదేవమ్మ వారి రత్నాల చవికి మొగదలను దిగవిడిచి – ముగుదల లందినదై కదిలివస్తూన్న భద్ర మదారమా...అని. మేల్! ఆ వయసున ఉండవలసినంత సలక్షణంగా ఉంది. కనుకనే మన పెద్దలు వీరిని లక్ష్యలక్షణ సమన్వయ రూపాన శాశ్వత శుభ శకునాలక్రింద జమ కట్టారు.

ఒక్క అడుగు దూరాన – అడుగు ముందుకు వేయడం ఆపి – అలనాడెనాడో సభవారికి నిండుగా మ్రొక్కేతీరున – సంయుత హస్తాన – ఆ ప్రాయాని కనువైనంత త్రిభంగిని నిలిచి – కనులతో కుశలమడిగి – వార్త ఏమని చూపులతో ప్రశ్నించగా –

తాను విషయమేట్లో విశదపరచిన వాడాయెను. ఏలా అంటే -

మన స్వగ్రామం, దైవకృపవల్ల ఇప్పటికీ, తగుపాటి మోతుబరీ గ్రామమే. ఒకానొకప్పుడు వేదశాస్త్రులకు నిలయమై ఉండేదట. ఆ ఉండటం చూసి అప్పటి నూజివీటి ప్రభువులు పరిసరాల ఉన్నటువంటి సుక్షేత్రాలు దాన పత్రాలు వ్రాయించి వీరికి దయచేయించినవారైనారట. కాని, ఏ కారణానో ఏమూలనో కించిత్ లోటుపాటు రావడం - అనగా, కొలతల్లో కొంత తఫావతు వచ్చి తీర్మానము నిమిత్తము మూడుకోర్ట్లూ తిరగవలసి రావడం సంభవించిందట - ఇచ్చినవారూ - పరిగ్రహించినవారూ కాని, అవి ఇంకా అంతో ఇంతో సత్యకాలమూ - పరిపాలకులు ధర్మప్రభువులూ కావడంతో ఉభయఖర్చులూ దివాణమే భరించేట్టు హుకుం ఇచ్చినారట. చివరకు మీది కోర్టులోకూడా తమకు అనుకూలం కాకపోయినా - బ్రాహ్మణులు సర్వదా పూజ్యులని భావించినవారు గనుక - ఆనందించి వారి ఆశీస్సులు అందుకుని మరింత ఘనంగా సత్కరించినారట.

వదాన్యత అంటే అదీ!

ఆ దివాంజీ ఉన్నాడే-సాటి గృహస్తే - ఏదో చూసీ చూడనట్టూరుకోరాదూ - ఊహుఁ అక్రమంగా ఆక్రమించుకున్నారు. మొర్రో అని రొష్టుపెట్టాడట. అతగాడేనట ఈ దావా తగాయిదాలకు కారణం - అట్లా ఉంటారు కొందరు. కత్తికట్టాడే కాని - కార్యం సానుకూలం చేయించగలిగాడా? ప్రభువులు సరసులుకనుక సరిపోయింది. ఇంతకూ మనలో మాట - ఇటువైపు పెద్దలున్నారే - వారిలో తపస్సు దైవచింతనతోపాటు సరిసమానంగా - ధనేషణకూడా వృద్ధిచెంది ఉంటుంది. జమీందారీ శేరీ - కట్టుకుపోయినంత అలా పోరంబోకగా పడిఉండటం మంచిది కాదనితోచి - చేతికందినంత మేర అందిపుచ్చుకుని ఉండి ఉంటారు. అది బాహాటమే. వీరి విభూతి పెండెకట్లూ - రుద్రాక్షలూ, దుశ్శాలువలూ వర్చస్సూ చూసి ఇలాటి భూదేవులు అక్రమానికి పూనుకుంటారా... ఎంతమాట...అని ముక్కుమీద వ్రేలువేసుకుని ఆ జడ్జీలు తీర్పు వీరిపరం చేసిఉంటారు. తిన్నది బ్రాహ్మలే కదా - పోనిద్దూ అని జమీందారుకూడా సరిపెట్టుకుని ఉండిఉంటారు.

వారి బ్రాహ్మణ భక్తి అలాటిది సుమీ! బ్రాహ్మణుడన్నవాడు ఒకవేళ నికరంగా దురాగతమే తలపెట్టనీ...అప్పుడూ మా విషయంలో వారు ప్రసన్నులే.

ఒకానొకప్పుడు ఆ, మా పెద్దల్లో ఒక నిరంకుశుడు, మదారుతనాన శ్రీవారి సన్నిహితు లొకానొకరు చేపట్టే ఉద్దేశ్యంలో ఉన్నటువంటి ఒకానొక చిన్నదాన్ని, కాస్త పుణ్యం కట్టుకున్నాడుట. అంతటితో ఆ కాబోయే పెళ్ళికొడుకు ఫాలాక్షుడైపోగా, ప్రభువులు హస్త చాలనంతో వారిని వారించి, "పోనిద్దురూ, వారు బ్రాహ్మణులు" అని సెలవిచ్చినారుట. అది అలా సమసిపోయేట్టు చేయడమే కాకుండా, అది కేవలం బ్రాహ్మణ సరసం కాకుండా, వారు రాజాంగంగా ఉండేందుకు కావలసిన సంభారములన్నీ దయచేయించినారట.

అదీ వారి ఉదార్యం!

ఏతావాతా చెప్పవచ్చిందేమంటే, మా ఊరి బ్రాహ్మణ్యంలో శ్రోత్రియత్వంతోబాటు కొంత శృంగార భావన కూడా కద్దు అని. ఎవరితో ఎలా మెసులుకోవాలో, ఎవరిని

ఎలా మన్నించవలెనో అంతో ఇంతో తెలియకపోలేదు. మునుపుకూడా మీవంటివాళ్ళు ఏ మేజువాణికో అంటూ మేము అహ్వానించగా రావడం, సంతోషంగా తిరిగి వెళ్ళడం ఆచారం. అప్పుడప్పుడు ఉభయులూ వయసులో ఉన్నవారైనటువంటి సందర్భంలో వచ్చిన మేళం మిడిమేలంగా కావడము కద్దు. అది ప్రకృతిసిద్ధం. దానికేం, ఏ ముచ్చటకు ఆ ముచ్చటే.

ఈమధ్య అద్దాంతరంగా ప్రభుత్వంవారు జోక్యం కలుగజేసుకుని దేవమాన్యాలనూ, దేవదాసీలనూ ప్రజల పరంగా నిషేధించి, తమ శాఖగా జమకట్టుకోగా, ఆ వెనుకటి వైభోగాలు వెనుకటితీరున కొనసాగించేందుకు వల్లగాక పోగా, ఆ కాళిదాసువా రన్నట్టు ఏ సరసమూ, చట్టుబండలూ లేకపోవడంతో మధుపానం అధునోవిడంబనా...అలా కాగా, దేశ వ్యాప్తంగా ఆ మూలా ఆ మూలా ఉన్నటువంటి లలిత కళ లనేవాటిని ఏకటాకిని మన రాజధానికి తరలించుకుపోయి ఏకరాశిజేసి, వాటి నిమిత్తం ఓ హెడ్డాఫీసు అంటూకూడా పెట్టి, ఆ రాశికి ముద్రశుద్ధి చేసి, ఛప్పన్న ప్రాంతములకూ కోటా పద్ధతి అంటూ ఒహటి ఏర్పాటుచేసి, ఇటుది అటూ అటుది ఇటూ రవాణా జరిపిస్తూ, ఏదో యథాశక్తిని వారూ ప్రజలబాగుకనే పాటుతున్నారనుకో...

కాని, దానా దీనా వ్యవహారం ఏ స్థితికి వచ్చిందంటే – నీకు తెలియందేముంది గనుక! తెలియకుండానే దేశం తెలుగువారిపోవడంతో – మీ, మా ప్రమేయమంటూ సాధ్యమైనంతవరకూ లేకుండానే శుభకార్యాలు వాటంతటవిగా జరిగిపోతున్నాయ్. పెండ్లిపందిట్లో వేదఘోష, గజ్జెలమ్రోత వినిపించకపోవడం అంటూ మునుపు ఎన్నడన్నా ఉందా?

రోజుల మహిమ. మనల్ని ఉద్ధరించేందుకు పదవులు భుక్తం చేసుకున్న మారాజుల మహిమ!

అస్తు!

కళావంతుల్ని నిషేధిస్తే కళాకాంతులుంటాయా? వీళ్ళ వెర్రికాని. అస్తాంతావదు.

ఇంతకూ, నే వచ్చినపని ఏమిటని అడిగావు కావు. మన గ్రామంలో పిల్లకాయలందరూ నిన్ను పిలుచుకువచ్చి, నీకో సన్మానం అంటూ సంకల్పించారు. కాని, ఇంతకుముందెన్నడూ మీ వాడకట్టున మెలగటం అలవాటు లేకపోవడంతో నన్ను ఉసికొల్పారు.

నేనూ ఇంతఃపూర్వము ఇలాటి రాచకార్యాలూ, రాయబారాలూ విషయంలో అభం శుభం ఎరుగనివాడినే అయినా – అందుకు సన్నద్ధం కావలసిన వయసు కాకపోయినా, ఇదేం బ్రహ్మవిద్యా – కానీ చూదాం అని బయలుదేరి వచ్చేశాను. బండి దిగినప్పుడుకూడా కించిత్ కాళ్ళు గజగజాటు ఉందనుకో. కాని సధ్యా ఎదుట పడ్డాక అదేమిటో ఎక్కడలేని ధైర్యమూ పుట్టుకొచ్చింది. అంత బెదురూ ఏమయిందో – నీ ముఖం చూస్తూంటే మతెటోపోయి మనసు విప్పి ఏవేవో పనస చెపుతూన్నాను. నా ధోరణికేంగానీ నీ అభిప్రాయం ఏమిటో ఈ చెవినివేస్తే...

నాకు అక్షేపం లేదు–మీ అంతవారు–ఎన్నడూ మా గడప తొక్కనివారు వెదుక్కుంటూ రావడం–ఇలా ఇంతసేపూ మాటా పలుకూతో మన్నించడం

నేను మరోలాగు అనగలనా? తమ సెలవు ప్రకారమే నడుచుకుంటాను...మరి, తమ దేవతార్చన విషయం...

ఆc... ఈ పూటకు దేవుడూ లేదు - అర్చనా లేదు. ఇహ మాపటికి ఇంటిపట్టునే!

అయ్యోరామ! రాకరాక వచ్చి - మును పెన్నడూ ముక్కూ మొగం ఎరుగకపోయినా ఎంతో కావలసినవారల్లే కలుపుగోలుతనంగా కబుర్లుచెప్పి - రవంత కార్యార్థులైకూడా వచ్చి పచ్చనిచెట్టు క్రింద నిలుచుని అభోజనం ఉంటామంటే....మేమేం అంత అంటీ ముట్టరాని వాళ్ళమా?

ఆc ఎంతమాట! నా ఉద్దేశ్యం అదికాదు. ఆ సదుపాయం లేనప్పుడు-మనమేం జేస్తామ్?

ఉన్నంతలోనే కల్పించుకుంటాము. ఎలాగో సరసంగా సర్దుకుంటామ్. కాని నిండిన ఇంట్లో ఒక్కపొద్దులుంటామా? పరమాదరణతో మేమే కావాలని వెదుక్కుంటూ దయచేసిన వారిని పనివేళా తిని కూచుని పస్తుపడుకోబెడతామా? అబ్బే, అది మా ఇంటా వంటా లేదు.

ఔను! మీ మరియాదలు అలాటివే. కాని కనుచూపుమేర బ్రాహ్మణ భవంతి అంటూ లేకపోయెను.

లేకపోయినంత మాత్రాన మీ బ్రాహ్మణీకానికి ఏలోటూ కలుగదు. మీ మడి ఆచారాలకు ఏ లోపమూ జరుగదు.

వండివార్చుని పాత్ర సామగ్రి ఉంది.

ఆ పక్కన చిక్కని నీడ ఉంది.

అంటూ సొంటూ సోకని చోటు.

నవకాయ రుచులూ అమర్చుకునేందుకు బద్ధకించినా, ఇన్ని బియ్యం, ఇంత పప్పూ కుంపటిమీదిగి ఎక్కిస్తిరా, మీ అనుష్ఠానం అదీ కానిచ్చుకుని, తిరిగి చూడకుండా దించెయ్యవచ్చును. ఇలాంటి వాటిల్లో చెయిదిరిగినవారే అయిఉంటారు. మీకు నేను చెప్పాలిట కాని, వేగిరం మడికట్టుకోండి. వేళ పట్టున మీరింత ప్రాశనచేసి, మీ చేతిమీదుగా నాకో ఇంత ప్రసాదం పెట్టండి. అదే జన్మానికి శివరాత్రి అనుకుని అంతటితోనే తృప్తిపడతాను.

అరి వీళ్ళిల్లు అంటుమామిడి తోటలో కట్టా! అందరూ నామీద పెత్తందారులే! మా ఇంటిపట్టు మనిషీ ఇలాగే పురమాయిస్తుంది. ఈ ఆడవాళ్ళది అందరిదీ కనిపించని గడుసుతనం.

గడుసుతనం అనుకోండి. పదికాలాలపాటూ భర్తగారిని సేవించుకునేందుకు, వారు అన్నవేళా ఉల్లాసంగా ఉండేందుకు పదిలంగా ఉంచుకుంటూన్న పడుచుతనం అనుకోండి. కనుకనే నోసటి కుంకుమకూ, నోచిననోముకూ, మగనాలి తీరుకూ, మగవారి ఊహకూ, ముసలితనం లేదు, రాదూ అన్నారు మీలాంటి పెద్దలు.

మీకు నేను జెప్పాలిట కాని...

ఇలా మాటల్లోపడి, భోజనం మాటే మరచిపోయే స్థితిలోకి వచ్చామ్, త్వరగా తెములండి బాబ్బాబు. మీరనుమతి ఇస్తే, మీ గడ్డం పుచ్చుకుని బ్రతిమాలుకుంటాను.

మరో రవంత స్వతంత్రం ఉండినట్టాయెనా, బుగ్గలు సాగదీసి బుద్ధిమంతనం నేర్పుతాను. మీరు–అలాగే నావంక రెప్పవేయక చూస్తూఉంటే అదేమిదేమని, ఆ కాస్త చనువు నేను చేసుకుని చేయిపట్టుకుని చెప్పినట్టు వినిపిస్తాను...ఏమని...సెలవు?

ఎలాగూ స్నానం చేయబోతున్నా గనుక, నీవు ఓ తగుమాత్రం ఒహావేళ చనువు తీసుకునే పక్షంలో తప్పలేదే అనుకో. కాని, దీన్నిగను పూలుముడవా!–పెంపకం అలాటిది కాకపాయె. పిన్ననాడు లేకపోయినా, పెద్దవాడైనా ఇలాటి లోకజ్ఞానం కూడా అంతో ఇంతో అవసరం అన్న ఇంగితం లేకపోయె. అందుమూలాన ఉన్నపళాన నీకిలాటి సదభిప్రాయం కలగడంతో అమీ తుమీ తేలక, ప్రస్తుతానికే అనుకో, నిరుత్తరుణ్ణి కావలసివచ్చింది. సహాలమూ, కాచి వడబోసిన దానివి, పుణ్యమూ పురుషార్థమూ ఎరిగినదానివి, నీకు నే జెప్పాలిట కాని....

స్విష్టకృత్‌గా భోజనం.

భోజనానంతరము...

ముందుసావడిలో తివాచీవేయించాను. తాంబూలం...

ఓఁ దానికేఁ వాస్తవానికి పగటిపూట ఎన్నడూ అలవాటు చేసుకోలేదనుకో. ఒకటో అరో ఏ లవంగమో, ఏలకిపండో బుగ్గ నుంచుకోవడం, అలా సరిపెట్టుకు వస్తున్నాను ఇంతవరకూ.

నాకు ముందే తెలుసు నీవు నన్నంతతో వదలిపెట్టవని. మనకీ వైభోగం మళ్ళీ ఎప్పుడు సంప్రాప్తిస్తుంది? ఈ మనిషి ఏం జెప్పినా సరేననడమే కాని, విధి నిషేధాలు ఏకరువు పెట్టకూడదు అని గట్టి నిశ్చయం చేసుకున్నామ్. అందులోనూ మీ చేతి తాంబూలం మహారాజ భోగ్యం కాని సామాన్యమా? అలాటిది ప్రతిఫల రహితంగా అందుకుంటున్నానంటే విశేషంకాదూ. ఈనాడు వేసుకుంటినో ఏటి కేడాదీ ఘుమ ఘుమలాడనూ? సందర్భం ఇలా కలిసి వచ్చింది. గనుక, సలక్షణంగా నీవు అందీయనూ వచ్చు, సంకోచరహితంగా నేను అందుకోనూవచ్చు.

అందులోనూ నీవు ముచ్చటపడటం, నేను మూర్ధవిధూననం చేయడమూనా!

నీకు నే జెప్పాలిట కాని, తగుదునని తాంబూలం ఇస్తూంటే, తప్పగా భావిస్తాడా వెలనాటివాడు. అహఁ.

కాని, ఒక్క చిన్న తిరకాసు ఉంది. ఉన్నదే అనుకో, అలా భావించడం పరిపూర్ణభ్రమ అని తెలుసుకున్నాను, తెలుసుకోగలిగాను. అనుకో.

అఁ మరేంలేదు. అదో పెద్ద విషయమున్నా కాదు. ఈ ప్రయాణానికి సమకట్టినప్పుడు ఏదో దూరదూరంగా ఉంటే ఈ రవంత కార్యమూ సాను కూలం చేసుకురావచ్చు ననుకున్నానేగాని, మీ గుమ్మం ఎక్కవలసిన అగత్యం కలుగుతుందనుకోలేదు.

ఇక్కడ నిలుచునే తాంబూలం పుచ్చుకుంటే అది దొడ్డి సంభావనవుతుంది. అది నీకూ నాకూ కూడా పర్యాయతని గౌరవప్రదం కాదు. పారజూడగా, నీవు చెప్పినట్లు నడచుకుంటే వ్రతభంగం ఎలా అవుతుంది? శ్రీమంతుల బిడ్డలకు మీ లోగిలి క్రీడారంగం. రసికులైనవారికి నీ వయారం మన్మథ విజయం. పుణ్య జీవనులకు నీ శయ్యామందిరం రమారమి పూజాస్థానం. సంగీత నాట్యసల్లాపాలతో

నిరంతరమూ ఒకనాడు మారుమ్రోగిన కళామంటపంలోకి నన్ను ఆహ్వానించడం నీ ఆప్యాయతకు పరమ నిదర్శనం.

ఇలా సంభావించేటప్పుడు మీనమేషాలు లెక్కపెట్టడం భావ్యంకాదు. కనుక, నీవు రమ్మన్న ప్రదేశానికి నిర్మల మనస్సుతో, నిశ్చలచిత్తంతో రానూ వస్తాను; నీ చేతి విడియం అందుకోవడమూ మానను. చూశావూ. అడుగడుక్కీ ఏమిటీ నస? ఏమిటీ తేమానం? అనుకుంటున్నావు కాదూ? నీవు ఎంత కాదన్నా నీ కన్నులు నిజం పలక్కమానవు.

అవును, ఆమాటకొస్తే ఛాందసం మెండు: చాదస్తం ఓపాలధికం.

అదన్నా, ప్రథమంలో మాత్రమే సుమీ! ఈషత్ పరిచయం అయ్యేనో ఇహ మమేకమే.

మరేమీ పట్టింపు లుండవు.

ఆహా! తాంబూల మనగా ఇది! ఎవ్వరు కాదననీ ఈ విద్య మీది.

వెనుకటికి పార్వతీదేవి అమ్మవారు కూడా తమ యొక్క లోకావన శృంగార సౌభాగ్యం పరిపూర్ణం కాదనే పరికల్పిత భావనతో – అనగా, స్వామివారు దారుకావనంలో విహారం చేయడం వగైరాలు దక్షారామంలో తనివిదీరడం – ఇత్యాదులు కర్ణాకర్ణిగా విని ఉండడంతో దీనికి ఏమి సాధనం చెపుమా అని పారజూసినదై, స్వామివారి సన్నిధి తనకు నిరంతరమూ లభించేందుకుగాను తాంబూలమనేటటువంటి ఈ ధన్వంతరి చిటకా అమలులోకి తెచ్చిందాయెను – అని స్కాందం చెపుతూంది.

నీకు నే జెప్పాలిట కాని...

వాసీజలమూ, వటచ్ఛాయా, తాంబూలమూ, ఆఁ...మరి...తరుణీమణియొక్క ఆ పొంకమూ, శీతకాలం గోరు వెచ్చదనం, వేసంగిలో కోరినంత చల్లదనం ప్రసాదించే సత్తా గలవి కనుక ప్రతి మానవుడూ ఈ విషయం విస్మరించకూడదు సుమీ, అని పెద్దలు హెచ్చరించలేదా?

కనుకనే ఈ తాంబూల మనేదాన్ని చర్విత చర్వణంగా సేవించిన పునరుక్తి, అతి వ్యాప్తి లేకపోవడమే కాక, గుణ వృద్ధి కూడా అవుతుంది. తత్త్వము తరుణానికి సమశీతోష్ణ స్థితిలో ఉంటుంది.

చిత్తం.

తత్త్వం సర్వదా సమశీతోష్ణస్థితిలో ఉంటే సన్యాసి అవుతాడు కాని, క్షణమాత్రమైనా జాణ అయ్యేందుకు ఆస్కారం ఉంటుందా?

నిజమే.

మహారాజులు, మహాకవులకు కర్పూర తాంబూలం ఇప్పించారంటే అర్థం... ఈ దీప్తితో ఉత్తమ కావ్యం రచించివయ్యా అనే కాదూ?

ఓ మదనాభిరామసుందరి, ఓ పద్మాయతాక్షి ఫలానా పాంచాలునికి చెలులెవ్వరూ చెంతనుండని ఏకాంతాన దొంతర విడె మందించినదంటే భావం...నీకు నే జెప్పాలిట కాని, మొత్తానికి నీ వన్నదే వాస్తవం కావాలి. సిసలైన తాంబూలమే గనుక సేవించినట్టయితే, ఎలాటి సాత్వికుడికైనా అంతో ఇంతో ఉద్దీపనం కలుగకుండా మానదు. అది సాజం!

అందాకా ఎందుకు – నామటుక్కు నాకు మృష్టాన్న భోజనం, నీచేతి విడియం, ఇలాటి చతురసల్లాపం...ఈ అతిథ్యంతో మునుపెన్నడూలేని వగలు వంటబట్టి...ముద్దు చేసేవారుంటే చంక నెక్కే స్థితికి వచ్చాననుకో. పోనీ, లేని సత్తువ తెచ్చుకుందామనుకున్నా...అబ్బా! అన్నసారం ధమనుల్లో పరివ్యాప్తమయ్యే సరికల్లా ఒళ్ళు మనం చెప్పినట్టు వినదు! నడుం వాల్చాలిసిందే ఇదీ మన వరుస.

పైగా, సీలమండలూ, పిక్కలూ, ఈ మోకాళ్ళూ ఒక్కటనేమిటి – ఇహ ఒకటే జివ జివ–వీటిసొమ్మంతా పడిపోయినట్టు.

"వయో ధర్మం!"

అవునే అనుకో. కాని, నా మానానికి నన్ను వదలదే. ఎంత పనిలో ఉన్నా, చెయి తెరిపి చేసుకునివచ్చి నన్ను కనుక్కోవలసిందే. చక్కగా సంవాహనం చేయవలసిందే. ఇహ చాలునన్నా వదలందే. అవును. పాతికేళ్ళనాటినుంచీ వస్తున్న అచారం. ఎక్కడ ఏ కీలుకు ఎలా తశ్మాంతి చేయాలో ఆ చేతులకు అమరిపోయింది. ఆ చేయి సోకడమేమిటి, హాయిగా కునుకుపట్టడమేమిటి? పిల్లలు ఎదిగొచ్చి, ఎవరి కాపురాలు వాళ్ల చేసుకుంటూ, ఎవరిదోవను వారు తలో చోటా సలక్షణంగా ఉండిపోవడంతో లంకంత ఇంటికి ఇహమిగిలిందెవరు? తనకు నేనూ, నాకు తాను! అంతేగామరి.

అలా కావడంతో అవిడ పదిమంది పెట్టు గారాబాలూ నాకు చేస్తూండటంతో మరీ సుకుమారం బలిసింది. కాకపోతే, ఈ అపసోపా లెందుకు చెప్పు?

అలవాటు.

అలవాటే అయితే ఇన్నాళ్ళనుంచీ ఏమైంది? ఇవాళకు సరిగ్గా మండలం. చిన్నకోడలికి పురుడోసేందుకు వెళ్ళింది. ఇహ నేడో రేపో మళ్ళీ దిగుతుంది, అః – ఇవాళ చవితి కాదూ...రేపూ.

ఇంతకాలం నా తిప్పలేమో నేను పడలా? తానే దగ్గిర కూచుందా? కాలునొచ్చినా, చేయినొచ్చినా సరిపెట్టుకుపోలా? దగ్గిర కూర్చుని బుద్ధులు నేర్పడం అదో సరసం కామోలు.

వచ్చి కూర్చుని పాదంమీద చెయి వేసిందో లేదో ఇహ ఓ కాశీ మజిలీ కథ అందుకుంటుంది. చెప్పింది చెప్పకుండా ఎన్నిరోజులైనా ఓ విసుగూ విరామం అన్నది లేకుండా చిలువలు పలవలుగా కల్పింది...

ఏనాటి ముచ్చట్లో...

తలో చోటా సలక్షణంగా ఉండటంతో ఇంటి దగ్గిర తనకు నేనూ, నాకు తానూ కావడంతో అవిడ గారాబాలన్నీ నాతోనే తీర్చుకోవాలాయెను. కనుకనే ఈ గూట దీపం పెట్టేందుకంటూ వచ్చిన కొత్తల్లో...

నిన్నిటు చూసి అటు దూసుకుంటూ, "కానీ చూద్దాం" అని కళ్ళతో పలుకరించిందట. నేను కనుక్కోనేలేదట.

ఆవేళపట్టున అకూ వక్కా అందించబోతే వీరికి అందుకోవడమే చేతకాదట.

సగపాలు ముందు తన కివ్వటం – ఆ నేర్పేలేదట. ఎలా పండింది! ఎంత అపేక్ష?...అంటూ మురిసిపోయే ముచ్చటే ఎరగనట.

ఆడలో పూలచెండు – చెంపకు ఓజారినా చూసీ చూడనట్టు ఊరుకున్నానుట. ముంగురులు చెరిగినా పట్టించుకోలేదట. నాకు సేవజేసి అలసిపోయినావ్ అని లాలించకపోతినట.

అసలు ఎలా పలుకరించాలో ఆ కలుపుగోలుతనమే ఏ కోశానా లేదట.

తాను అత్తవారింట అడుగుపెట్టిన రోజుల్లో నేను వట్టి ఋష్యశృంగుణ్ణిట. కావాలని పనివేళా కలుగజేసుకుని ఎలాగైతేనేం ఇన్నేళ్ళకు ఇంతవాణ్ణి చేసిందట.

ఇంతవాణ్ణంటే ఎంతవాణ్ణిలే... ఇలా చిన్నెలూ వన్నెలూ చిద్విలాసాలుగా ఆవిడ చెప్పుకుపోతూనే ఉంటుంది.

వినగా వినగా ఓ కునుకు.

శ్రీరామా–రక్షకా–సీతామనోహరా!

అబ్బా!

ఆఁ...

తెలియకుండానే కునుకుదీశానే.

పరాయిచోట పక్కవేయడమే అలవాటులేదు.

అందులో ఎదురుగుండా తగు మనుష్యులుండగా ఎలా పట్టిందబ్బా ఇంత ఒళ్ళూపైదెలియని నిద్ర!

సధ్యా, నీవుగాని జాలిదలచలేదు కద!

అదిగో, అలా ఒక్కనవ్వు నవ్వి ఊరుకుంటే నాకు అర్థమయేనా...చెపుదూ?

ఆఁ నిజమే. ఇలాచూడు. నీ కిదిన్యాయమేనా? మహారాజులంతలేసివాళ్ళచేత అడుగులకు మడుగులొత్తించుకున్నదానివి.

దానికేం లేస్తురూ.

అది అప్పటిముచ్చట. ఇది యిప్పటికి ముచ్చట.

అలా ఎదురుగా మీ అంతవారు అరమరికలేకుండా అపసోపాలు పడుతూంటే ఎలాచూస్తూ ఊరుకోనండీ.

పోనీ ఊరుకుందామన్నా చేసినచేయి ఊరుకోందే!

ఇదేం అకార్యమా – కాదు.

మీరూ లోకంతోపాటివారే. అయితే, కోరి, చేయించుకోకపోదురా? కాకపోతిరి! నేను కాస్తకనిపెట్టి చూడద్దూ.

ఆఁ అయినా యిదేమంత మహాభాగ్యం లేస్తురూ.

తానూ ఇక అట్టే సాగదీయడం సరసంకాదు.

సరిపెట్టుకున్నాడు.

పండూ ఫలమూ తీరుబడిగా అరగించాడు.

తూరుపుబండి దానిత్రోవదానిది.

ప్రదోష సమయం. ఈశ్వరాలయం.

తనకు...దారితోడు–ఆ మార్దంగికుడు.

చూడగా చూడగా అతగాడు పొడిమనిషి కాడు.

తరతమా లెరిగినవాడు. తనవిద్యలో తగుపాటి పారజూసినవాడు.

ఉండీలేనట్లు మెలగనేర్చినవాడు. వెంట ఉండతగినవాడు.

ఆలయ ప్రాకారానికి పదిబారల ఈ చెంపను చిన్న కొనను, చిక్కంగా తామర తంపర.

ఒంటిగా చంద్రుడు. పక్కపక్కల చుక్కలు.

వెలుగని వెన్నెల, సోకని గాలి, కనిపించని వేడుక, అనిపించని వేదన!

అది గమనించా డతగాడు.

ఇది ఎంతో పుణ్యము చేసుకున్న స్థలమయ్యా, మీవంటివారికైన పూజాస్థానమయ్యా!

ఎలాగనేదా!

ఇక ఇతిహాసమున్నది వినేరా? –

వేయేళ్ళకు వెనుక. నూరేళ్ళకుముందు ఈ దేశమేలే మారాజు కొడుకు–నిండు పున్నమివంటివాడు – వయసు వచ్చినవాడు కాగా –

ధర్మా లోకటిగా – తత్పరత లోకటిగా – పొలిమేర లోకటిగా పరిపాలన చేస్తున్న వీరాధివీరుడు.

వీరే తమకు అల్లుడని అనుకోగా, వారి ఆచారము మేరకు నిండుసభలో నిలువు తెరలు కట్టించి ఆ వంక రాణి వాసమూ, ఈ వంక మగపెళ్ళివారూ ఆసీనులై ఉండగా పురోహితులవారు పది ముత్యములూ, ఒక్క రత్నమూ యువరాజు దోసిలిలో ఉంచి –

తెర మరుగైఉండి, ఈవలకు చేజాపిన ఆ చిన్నదాని దోసిలిలో ఉంచమనగా – బ్రాహ్మణాశీస్సులు చెలరేగగా,

ఆ రాజకుమారి, అతడు అలా తన హస్తములలో ఉంచిన ముత్యాల్నీ–రత్నాన్నీ పెద్దలు ఆదేశించగా – తనకు కనుచాటుగా పెళ్ళికుమారుడి సమీపంలో ఉన్న దేవతా విగ్రహంమీద ఒక్కసారి అర్పించమనంగా...

ఆచేత ముత్యం మిగిలె. ఎంత తప్పు!

అది ఆ కాలపు ఆచారమయ్యా. చిన్నదానిచేత రత్నం మిగిలితే ఆ మనువు రాణింపుకొచ్చేను. జంటముత్యాలైతే సంతానవతి అయ్యేను.

ఒంటి ముత్యమైతే వెలయాలు!

అది బహు అరుదు. కాని, ఆ నొసటనే ఆ పొద్దు పొడిచింది.

తప్పదు తలవంపు.

కన్నతండ్రి దద్దరిలిపోయె. కనుగొన్నవారు తల్లడిల్లిపోయిరి.

ఆ చిన్నవాడట్టె లేవబోగా – ఒక్కనిమిషము ఆ చెయ్యోడిసి పట్టిందా చిన్నది.

చిరునవ్వు నవ్వుకున్నది. మతిపోయెనేమో అనుకుంటిరట. కన్నతల్లి వాపోయిందట. చిన్నది మరోనవ్వు నవ్విందట.

ముత్యానికి సత్యం తప్పదమ్మా అంటూ మరింతగా నవ్విందట.

ఆ తల్లి మనసు మనసులో లేదట.

కన్నతండ్రి కంటతడి చూసిందట.

పూసినపూవు దేవునిపూజకైనా, పూబోణి సిగలోకైనా...

చేసుకున్న పుణ్యం ఒక్కటే మహారాజా!

ముత్యం నన్ను వెలయాలిని చేయలేదు. వెలలేని ముత్యాన్ని చేసింది.

ఇందుకు చింతపడతారా. అదోతీరుగా నవ్విందట.

వారు వైద్యులకు వర్తమాన మంపినారట.

చిన్నది, చెలికత్తెలతో అంతర్ధానమైనదట

ఇహ, అక్కడ ఆ పెళ్ళికుమారుడు ఏ స్థితిలో ఉన్నాడంటేనూ -

ఓ మహారాజ కుమారా మన్మథాకారా!

ఈ వెలయాలు నిన్ను చేపట్టింది పెద్దల సన్నిధిని.

ఇది వెల్లడికాక మానేనా...

వెలయాలి భర్తకు ఎవరు పిల్లనిచ్చేరు?

మరి, మీ రేమయేరు?

ఇలా పత్రిక లిఖించి పంపిందయ్యా! వారూ, మతిపోకముందే మాయమైనారు!

ఆ పరిస్థితి అలా ఉండగా...

ఇక్కడ ఈ చిన్నదీ, చెలికత్తెలూ అలా తరలివచ్చి-

ఎవరికీ, కానరాని ఏకాంత ప్రదేశమని ఈ ఆలయంలో విడిదిచేసుకున్నవారై, స్వామిసేవలో తత్పరులై గతం మరచి, కలత దేరి ఉంటూండగా ఒకనాడు ఒక ఎరుకసాని పులుకు పులుకునవచ్చి ఈ చిన్నదాన్ని చేరబిలిచి, "ఎరుకో అవ్వ!" అనంగా, ఈ ఎరుకలు మాకెరికేలే అనీ తుసారించి "పిడికెడు ముత్యాలు బిచ్చం వేయండే" అన్నది.

ఎరుకసాని మెరుపాడినట్లాడి "ఆసి ఇడిక్కా, మిడిసి పడేవే" అనంగా, గురువు ఎదుట ఉన్నట్టు, గురి కుదిరినట్టు, నేరనివిద్య నేర్పినట్టు, నియమాన ఉన్నట్లు ఆ చిన్నది అలవిమాలిన వయారాలుపోయి తన మనికి తానమై, తన ఉనికి గమకమై, పదవిన్యాసము స్వరజతియై, కరచాలనం సరళస్వరమై, నాట్యమాడి, ఒక క్రమానికి కులుకూ కుయీ మందగించి, మరో క్రమానికి మాన్పడగా-ఎరుకత ఉవ్వెత్తున నవ్వి కొండదేవరకు గగ్గోలుచేసి, గగనం చలించేట్టు సంకుపోయగా, అడినంతమేరా రత్నమల్లే తళుకిచ్చి, ముత్యాల రంగవల్లి రేకలుతీరి, ఆ బాల ముత్యాలలో తానో ముత్యమై ఉండిపోయిందట.

అప్పుడు కొండసాని వాక్కు ఏమన్నదంటే - ఆసి-తగరా!

"తండ్రి ఇచ్చిన బలిమి, తల్లిఇచ్చిన కలిమి, జన్మ ఇచ్చిన చెలిమి-చెల్లిపోయె-కోనకొచ్చి అయ్యమెచ్చి సానివైనావు-నీ చేతిముత్యం దేవర బేసికన్ను...ఆ చలువ సోకితే...సగం పాపం పోయేను. పోయిపోయి నీ చేతికి సోకిన మామిడితీగ- నీవు కదలినా నీడకదలని చోట, పాదుంచవే. మాటలో చిగిర్చి-పాటలో ఫలించి-ఆపైన పూసేనే కనకమామిడి. చిగురుచూసి, చిన్నెచూసి చిలక ఈకడ వ్రాలంగ-చివ్వో చివ్వో రాజకూతురి రాజసాలకు రవ్వో-రవ్వో-"

ఎరుకత కనుమాటైంది. ఎక్కడుంది? కనకమామిడి - ఆనవాలు తెలియని దానికోసం ఎలా వెదకడం? చేత మిగిలిన ముత్యం కొండదేవర బేసికంటికి అమరించింది. ముత్తెంలో ముత్తెమంత మెరుపురాబోయి, అంతలో వెన్నెల సన్నగిలినట్టు తళుకు తరిగి-పులుకు మిగిలింది.

కోన అంతటా కలయతిరిగింది. మనస్సు ఏ తీవెమీదికి పోలేదు. ఎన్ని లతలో చేతికి సోకినా, తనకు గగుర్పాటు కాలేదు. ఇదే అనిపించలేదు.

అలాగ ఎన్నిపొద్దులో ఆ రాజకూతురు తీవెను వెదికే తీవెగా అల్లాడిపోయి, తిరిగి కొండదేవర కొలువుకు వచ్చి, ఆ సన్నిధిలో మోకరిలి వాపోయింది:

ఎక్కడుంది కనకమామిడి?

సన్నిధిలో!

తీవే ఆ చేతికి సోకింది.

ఆ కంటివెలుగు చిన్నదానిమీద కమ్మింది!

దేవర వెన్నుచరచినంత నిబ్బరంతో, ఆ రాజు కూతురు, తీవెకు ఎక్కడ పాదుచేసింది? ఇదిగో–ఇక్కడ!

కనకమామిడి, నేల ఊనగానే, చిగురించింది. ఆ చిన్నది, తనకు తెలియకుండానే, అమితమైన ఆనందాన ఒడలు సారించగా – ఫలించింది.

చిగురు చిగురుచాటునా, ఓ రవ్వ, ఓ రతనం, ఓ కెంపు, ఓ పచ్చ ఫలించాయి. రవ్వలమీద సూర్యదేవర కన్ను పడగానే, తీవెన్న చిగురులు ముత్యాలయినాయి.

ఆ చిన్నది, ఆ వంక – ఆ కన్ను – అలా ఆర్పకుండా చూస్తూండగానే–

కోట విడిచిన రాజకుమారుడు, సరిగా యిక్కడకే వచ్చాడు. చేయందుకున్నాడు. చిన్నది, రవంత విదిలించుకోబోయింది.

కోటకు దూరమైనావు కావు. కోరికలకు దూరము కాలేకపోయితివి. నామీది పగ నాట్యమాడి తీర్చుకుంటివి. వెదకి వేసారేవేళ, ఎరుకసాని చెప్పిందిలే. తానే ఎదురై, మన కథ చెప్పిందిలే. వెలలేని ముత్యానివైనా, వెలయాలివైనా, నీవు నాదానివే! చెయ్యొడిసి పట్టినదానా, నన్ను చిన్నబుచ్చకే, అన్నవాడు కాగా–

నీకు చిన్నతనం కారాదనే–చేయందుకున్నాను అంతే! కాని, కోటలో శకునం వెన్నాడకుండా కొండదేవర శరణిచ్చాడు. కనకమామిడిచ్చి కాపుండవే అన్నాడు.

ఎరుకసాని మేలుచేసింది కాని ఎడబాటు తీర్చలేదు. దేవుని చూసిన చూపున నిన్ను చూడలేను. నిన్ను చూసుకుంటూ నవ్వకుండా ఉండలేను.

కనక మామిడికి నేను కామనలేక కాపున్నాను–ఆ ఫలం, నా మనోరథం! ఆ లత నా నిత్యమాంగల్యం! ఏ సేవలూ కోరని ఈ తీవెను విడిచి, నీ సేవలు నాకు జెల్లవయ్యా!–అన్నదాయెను. అప్పుడు ఆ రాజకుమారుడు తన ఠీవికి తగినంత మందహాసం చేసి –

"ఎరుకసాని పలుకు ఫలించింది. కామనలేని కామిని రతనాలు మనోరథమైన మానిని ఏ సేవలూ కోరనివారిని మన్నించే మదిరాక్షి, కనకానికి కాపున్న కళ్యాణి–నీ మనవి ఆలకించేనులే" అన్నది. చిన్నదానా? నీ ఎదుటనున్నది కనకవృక్షమే! అని బుజ్జగించి, కనకమామిడికి కనులారా మ్రొక్కి –

నీవు ఫలించినట్లు మా నెయ్యము ఫలించాలి! నీ చిగురులు ముత్యాలు యీ బాలనగవుల రత్నాలుగా నీ సొంపులు ఈ వగలాడికి హేమ–సంపదగా కనకానికి సేవలు చేసినందుకు – కనకమే కామనగా– సర్పమే రూపముగా, తారుణ్యమే నీవుగా, యీ కులాస బాలలు వర్ధిల్లాలి! అని అంజలి మ్రొక్కగా కనకమామిడి

ఫలించిన రతనాలు, ఆ రాజకుమారుడి దోసిటనిండగా, ఆ చిన్నది సిగ్గుపడుతూనే ఆ చేతులు అందుకున్నదాయెను కాగా –

కనకమామిడి దేవరసన్నిధికి మాయమై కథ మిగులు మొదలైంది.

ఎట్లనగా,

చేతికిచేయి సోకినపుడు దోసిటి రత్నాలు కదలగా కదలని నీడలు కదిలె. కనకమామిడి కుదురుకొన్నచోట తళుకు మొగ్గల జాలారు కమ్మె...

ఆ చిన్నది సిగ్గుమాలినతనమే సోయగమై, కనకమే నిగ్గుదేరిన కనుపాపై, కులుకే తిలకమై –

ఆ రాజకుమారుణ్ణి–అంతరంగాన జేర్చుకున్నదాయెను: అయ్యా! ఇదీ ఇక్కడికథ! ఆ రాజకుమారి పేరు రాకేందువదన!

అది మా కులానికి సత్యం! వినిపించి ముగించాడు అంకాలు. తాను విని ఊరుకున్నాడు.

అహా! అని ఘనసు పలికింది. కథ కనులలో కలయదిరిగింది.

తిరిగి యింటికి వచ్చాడు.

స్నానంచేసి దేవతావందనం చేశాడు. పాలుమాత్రం ఆరగించాడు. పై ఆసలేదు. అంకాలు మంచి గంధపు కలపము కనులముందుంచాడు. అలదుకున్నాడు.

పన్నీరుపై జల్లగా తనకువచ్చింది స్తోమత!

వచ్చింది! ఎగిరి వాలింది రంభ!

రంభ చెల్లెలే రాకేందువదన!

కప్పూర విడెము అందించింది.

గానాన ఆడింది.

కాగా తన మానాన తాను లేడు.

కాని, తనువు తెలియని స్థితిలో లేడు – రాలేదు. రంభ కనుసైగచేసింది. చేజాపింది. తాను చేతులు ముకుళించాడు.

దోసిట రత్నాలు లేవే చినదానా అన్నాడు.

రత్నమంటి దీవెన యివ్వలేరో అన్నది.

తాను దైవాన్ని తలచుకుని, తలవంచాడు.

"నేను రాజకుమారుణ్ణే కాను!"

"నేను వెలలేని ముత్యాన్ని కాను!"

తాను తలఎత్తి చూశాడు. బహుకరుణగా చూశాడు.

"మనకు ఫలప్రాప్తిలేదు" అన్నాడు.

రంభ బింకంగా నవ్వింది. "బ్రాహ్మణీకమే ఫలప్రాప్తి!"

హతోస్మి అనుకోబోయిన మనసు ధన్యోస్మి అనిపించింది.

తాను ఎత్తినతల వంచలేదు.

రాకేందువదన అతివినయంగా అడిగింది: "అయ్యా, తాము యిక నిదురించేరా?"

అమాయికంగా ఆనందంగా అమర్చి ఉన్న పాన్పుమీద తనకు తాను నిదురపోయినాడు. తూర్పున తెలవారకముందే మేల్కొన్నాడు.

...రత్తమ్మా! వెళ్ళివస్తాను...గాని –

మళ్ళీ రాలేరు. కాని, ఒక్కక్షణం –

తాంబూల మిచ్చింది. పైన సేలువ వేసింది, ధోవతుల చాపు కట్టబెట్టింది. దోసిలినిండు విచ్చురూకలు అర్పించింది. పాదములంటింది!

యిదేమిటన్నాడు! ఏనాడో తాను పట్టిన నోములకు యీనాటికి...ఉద్యాపన. కాక, దేవబ్రాహ్మణులు తన యింటికే వేళనుండివచ్చేరు?

ఆ మాటకు తాను సంతోషించాడు.

సెలవయ్యా! తమ అజ్ఞప్రకారము ఆనాటికి వచ్చి తీరకమానను. మరోసారి తమ దర్శనభాగ్యం చేవిడుచుకుంటానా – కాని, అన్యధా భావించవద్దు. అక్కడ మరో కథ!

రత్తమ్మ చనువుగా నవ్వింది.

తనకు అప్పుడూ రవంత మతిపోయింది!

★ ★ ★